
సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 8 । జూలై । 2023



డెల్టాలకు 8,600 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,600 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 2,390, సెంట్రల్ 1,710, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.75 అడుగులుగా ఉంది.



శ్రీవారిని దర్శించుకున్న డీఐజీ

దేవరపల్లి: గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారిని డీఐజీ అశోక్‌కుమార్ గురువారం రాత్రి దర్శించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.5°/25.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	33.5	26.0
కాకినాడ	32.5	25.0
అమలాపురం	32.0	27.0

అగ్రపథాన వైఎస్సార్ ముద్ర

- మెట్ట రైతులకు చేయని మేలంటూ లేదు
- రుణ మాఫీతో సాగురంగాన చెరగని ముద్ర
- వ్యవసాయాన్ని పండగలా మార్చిన గొప్పనేత
- గోదావరిపై ఐదు ఎత్తిపోతల పథకాల నిర్మాణం
- కొవ్వాడ ముంపు నుంచి మండలాలకు మోక్షం
- కృష్ణా, గోదావరి డెల్టా స్థిరీకరణకు చింతలపూడికి శ్రీకారం

టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ రంగానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణం పోశారు. తాను సీఎం అయ్యాక ఈ రంగాన్ని అగ్రపథాన నిలిపేందుకు ఎంతో శ్రమించారు. అన్నదాతకు అండగా నిలిచేందుకు బడ్జెట్‌లో సింహభాగం కేటాయించారు. ముందెవరూ దృష్టి సారించని సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. పాదయాత్రలో రైతుల బాధలు కళ్లారా చూసిన ఆ మహానేత తాను అధికారంలోకి రాగానే వారి కన్నీళ్లు తుడిచారు. రైతు కడగండ్లను గట్టెక్కించేందుకు నడుంబిగించారు. అందుకే ఆయనను రైతు బాంధవుడిగా కొలుస్తారు అన్నదాతలు. నేడు ఆయన జయంతి. ప్రభుత్వం రైతు దినోత్సవంగా నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లాలో రైతన్నకు వైఎస్సార్ అందించిన సేవలు ఒకసారి మననం చేసుకుంటే..

కొవ్వూరు: జిల్లాలో మెట్ట ప్రాంత రైతుల గుండెల్లో వైఎస్సార్‌ది ప్రత్యేక స్థానం. ఏళ్లు గడిచినా ఆయన చేకూర్చిన ప్రయోజనాలు చిరస్మరణీయం. జిల్లాలో వ్యవసాయ రంగంలో నష్టపోతున్న రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేసి ఆదుకున్నారు. కరెంటు బకాయిల రద్దు ద్వారా మెట్ట రైతుల జీవితాల్లో వెలుగు నింపారు. బీడు భూములకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించారు. పావలా వడ్డీకే పంటరుణాలు అందించి ఇతోధిక సాయమందించారు. పీకల్లోతు పంట అప్పులలో మునిగిన రైతులకు రుణమాఫీతో వెన్నుదన్నుగా నిలిచారు. ఉచిత విద్యుత్ పథకం అమలుతో దేశంలో రోల్ మోడల్‌గా నిలిచారు. తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేసి వ్యవసాయ రంగానికి ఊపిరిలూదారు. 1999–2004 మధ్య ధాన్యం మద్దతు ధర రూ.60 (12.5 శాతం) ఉంటే వైఎస్సార్ హయాంలో రూ.490 నుంచి రూ.500కు పెరిగింది. ఇతర పంటలకూ రూ.560 నుంచి రూ.1,000వరకు మద్దతు ధరలు పెరిగాయి.



తాడిపూడి ఎత్తిపోతల పథకం పైపులైన్ల నుంచి విడుదలవుతున్న సాగునీరు



వైఎస్సార్ హయాంలో నిర్మించిన తాడిపూడి ఎత్తిపోతల పథకం పంపుహౌస్

తూర్పులో వైఎస్సార్ ముద్ర

తాళ్లపూడి మండలంలో సుమారు రూ.500 కోట్లు వెచ్చించి 16 మండలాల్లో 2,06,600 ఎకరాలకు సాగునీరు అందించే తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. కొవ్వాడ కాలువ వరద ముంపు నివారణకు రూ.56 కోట్ల వ్యయంతో అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మించారు. దీంతో కొవ్వూరు, పోలవరం, గోపాలపురం నియోజక వర్గాల పరిధిలో పదిహేను వేల ఎకరాలకు వరద ముంపు సమస్య తీరింది. వైఎస్సార్ హయాంలోనే పోలవరం ప్రాజెక్టులో ఎక్కువ పనులను పూర్తి చేశారు. కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకువచ్చారు. కుడి,ఎడమల ప్రధాన కాలువలు తవ్వించారు.

మెట్ట రైతుకు మేలు

మెట్ట ప్రాంతంలో రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో గోదావరి నదిపై తాడిపూడి సమీపంలో చింతపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా కృష్ణ డెల్టా ఆయకట్టు స్థిరీకరించాలని ప్రయత్నించారు. ఆయన హయాంలోనే పనులు ప్రారంభించారు.రూ.15.26 కోట్లతో కొవ్వూరు, తాళ్లపూడి,దేవరపల్లి మండలాల్లోని 4,950 ఎకరాలకు సాగునీరు అందించే ఆరికిరేవుల ఎత్తిపోతల పథకం కింద తొంభై శాతం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూశారు. కుమారదేవం ఎత్తిపోతల పథకాన్ని రూ.1.75 కోట్లు వ్యయంతో పునరుద్ధరించారు.

అన్ని రంగాల్లోనూ అదే తీరు

టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.75 ఇచ్చే వృద్ధాప్య, వితంతు, పింఛన్లను వైఎస్సార్ రూ.200కు పెంచారు. వికలాంగ పింఛను రూ.500కు పెంచిన ఘనత కూడా రాజశేఖర రెడ్డిదే. తన హయంలో ఆర్టీసీ,విద్యుత్ చార్జీలు పెంచకుండా వైఎస్సార్ కృతనిశ్చయంతో పనిచేశారు.ప్రజలపై ఒక్క రూపాయి పన్ను కూడా అదనంగా వేయలేదు. ఆరోగ్యశ్రీ, పథకంలో ఎందరికో ఆరోగ్య భాగ్యం కల్పించారు. ఇప్పటికీ తాము చేయించుకున్న గుండె ఆపరేషన్లను ప్రజలు గుర్తు చేసుకుంటూనే ఉంటారు. ఇక పేద విద్యార్థులను ఉన్నత చదువులు చేదివించేలా ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్‌మెంటు చెరగని ముద్ర వేసింది. జిల్లాలో ఎందరో విద్యార్థులు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారంటే అది ఆ మహనీయుని చలవే.

వ్యవసాయం దండగన్న బాబు

అధికార పగ్గాలు చేపట్టే సమయానికి రైతులు వ్యవసాయ రంగంపై దాదాపుగా ఆశలు వదులుకున్నారు. టీడీపీ ఈరంగాన్ని అసలు పట్టించుకోలేదు. వ్యవసాయం దండగంటూ ముఖ్యమంత్రి హోదాలో టీడీపీ అధినేత అన్న మాటలు వారిని నిరాశ పరిచాయి. సాగు దారి తప్పింది. ఇలాంటి పరిస్థితిలో వ్యవసాయ రంగానికి మళ్లీ జీవం పోయడానికి వైఎస్సార్ తన ఐదేళ్ల పాలనలోనూ విశేషంగా కృషి చేశారు. మళ్లీ రైతు సాగు వైపు మళ్లేలా చేశారు.



నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి

ఎత్తిపోతలెన్నో..

మండలం బ్రాహ్మణగూడెంలో రూ.273.28 లక్షలు వెచ్చించి 1200 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఈపథకం ద్వారా 600 ఎకరాలలో పంట ముంపు సమస్యను తీర్చారు. తాళ్లపూడి మండలంలో 4,950 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.8.59 కోట్లు వెచ్చించి పైడిమెట్ట ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. సబ్ పైప్‌లైన్‌ల నిర్మాణ నిమిత్తం అదనంగా రూ.3.31 కోట్లు వెచ్చించారు. రూ.360.06 లక్షల వ్యయంతో చాగల్లులో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

రైతు బాంధవుడు వైఎస్సార్



మెట్ట ప్రాంతాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు అందించిన మహనీయుడు వైఎస్సార్. తాడిపూడి,పైడిమెట్ట,చాగల్లు,బ్రాహ్మణగూడెం వంటి పథకాలు ఆయన వల్ల రూపుదిద్దుకున్నవే. ఉమ్మడి కృష్ణా,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 4.80 లక్షల ఎకరాల్లో మెట్ట రైతులకు సాగు నీరు అందించే చింతలపూడి పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టిన గొప్ప నాయకుడు. మెట్ట ప్రాంత రైతులు నిలదొక్కుకునేలా ఎంతో సాయమందించారు.

–గోలి శ్రీనివాసరావు,
కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు

మెట్ట రైతులను ఆదుకున్న మహానేత



మెట్ట ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న సమయంలో రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రగా దేవరపల్లి వచ్చారు. ఉచిత విద్యుత్, విద్యుత్ బకాయిల రద్దు,రైతు రుణ మాఫీ ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేశారు. రైతు శ్రేయోస్సే లక్ష్యంగా పనిచేశారు.మెట్ట ప్రాంతానికి ఎత్తిపోతల పథకాల సాగునీరు అందించి రైతు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

–చవల సూర్యచంద్రరావు,రైతు,
చిన్నాయిగూడెం,దేవరపల్లి మండలం

న్యూస్‌రీల్

రూ.1,01,116 విరాళం



దాతకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న సిబ్బంది

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో నిత్యాన్నదానానికి మంగిపూడి భాస్కరశర్మ (రాజా) జ్ఞాపకార్థం మంగిపూడి సీతారామ లక్ష్మి, ఆమె కుమారుడు వెంకట సత్య సుబ్రహ్మణ్య ప్రసాద్ (పి.గన్నవరం మండలం నరేంద్రపురం) శుక్రవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

21 నుంచి బీఎల్‌ఓల ఇంటింటి సర్వే

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితాలోని మార్పులు చేర్పులకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకూ ఇంటింటి సర్వే చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. చేర్పులు, తొలగింపులు, ఎలక్టోరల్ శుద్ధీకరణ, యువ ఓటర్ల నమోదు, ఫిర్యాదులు తదితర అంశాలపై నియోజక వర్గ ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల చేర్పడం, మరణించిన వారిని తొలగించడం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఆగస్టు మొదటి వారంలో విశాఖపట్నంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సమావేశం నిర్వహించే క్రమంలో ఎటువంటి పెండింగ్ దరఖాస్తులు, డూప్లికేట్ ఓటర్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డీఆర్వో జి.నరసింహులు పాల్గొన్నారు.

రత్నగిరిపై ఉచిత వైద్యసేవలు

అన్నవరం: సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో అపోలో హాస్పటల్స్‌కు కేటాయించిన సెంటర్‌లో భక్తులకు 24 గంటలు ఉచితంగా సేవలందించేందుకు బిలియన్ హార్ట్స్ బీటింగ్ అనే సంస్థ (న్యూఢిల్లీ) ముందుకు వచ్చింది. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా మందులు సరఫరా చేయడంతోపాటు, శిక్షణ పొందిన సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటారన్నారు. సంస్థకు చెందిన ఆపరేషన్స్ హెడ్ సుధా జిజారియాతో దేవస్థానం ఎంఓయూ కుదుర్చుకున్నట్టు ఈఓ తెలిపారు.

ఉత్సాహంగా యువ ఉత్సవ్

రాజానగరం: మన దేశంలో ఉన్నంత యువశక్తి మరెక్కడా లేదని నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అందువల్లే వీరు దేశ, విదేశాలలో ఉద్యోగావకాశాలను పొందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నెహ్రూ యువకేంద్రం (కాకినాడ) సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం యువ ఉత్సవ్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని రుడా చైర్మన్ షర్మిలారెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని యువత వివిధ రంగాలలో ముందంజ వేయాలని ఆకాంక్షించారు. లక్ష్య సాధనకు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని సూచించారు. క్షణికావేశాలకు లోనై జీవితాలను పాడుచేసుకోకూడదని హితవు పలికారు. ఆలోచనతో వ్యవహరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లా యువజన అధికారి పి.అమృతేష్ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలలో భాగంగా అమృత ఉత్సవాలు నిర్వహించామన్నారు. మొబైల్ ఫొటోగ్రఫీ, పొయిట్రీ, డిక్లమేషన్, పెయింటింగ్, వివిధ రకాల పోటీలు నిర్వహించారు. యువత తమ ప్రతిభను కనబరుస్తూ సాంస్కృతిక ప్రదర్శనలతో పోటీ పడ్డారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, డాక్టర్ పి. విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



అలరించిన సాంస్కృతిక ప్రదర్శన



జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న రుడా చైర్మన్ షర్మిలారెడ్డి



విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

డీఐజీ అశోక్‌కుమార్

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసకుంటామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన దేవరపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డీఐజీ విలేకర్లతో మాట్లాడారు. రహదారి ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్ అథారిటీ అధికారులు, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించామన్నారు. ఎన్‌హెచ్ హైవే పెట్రోల్, పోలీస్ హైవే పెట్రోల్ వాహనాలు నిరంతరం తిరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి సమయంలో హైవేపై వాహనాలను పార్కింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలపాలన్నారు. హైవేపై వాహనాలు మరమ్మతులకు గురైతే అక్కడ రేడియం స్టిక్కర్లు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. యర్నగూడెంలో మద్యం దుకాణం రోడ్డుకు ఒక వైపున ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని విలేకర్లు ప్రస్తావించగా లొకేషన్ మార్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హైవేపై అవసరమైన ప్రదేశాల్లో అండర్ పాస్‌లు, రోడ్డు క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈవ్‌టీజింగ్, గృహహింస, మహిళలపై జరుగుతున్న నేరాలపై నిరంతరం నిఘా పెట్టామన్నారు. అక్రమ మద్యం, ఇసుక రవాణాపై ఎస్ఈబీ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీకి తగు ఆదేశాలు ఇస్తామన్నారు. గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగితే 14500 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్పీ వర్మ, సీఐ అనసూరి శ్రీనివాసరావు, ఎస్సై కె. శ్రీహరిరావు, గోపాలపురం ఎస్సై కె. రామకృష్ణ ఆయన వెంట ఉన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చిత్రంలో డీఎస్పీ వర్మ

అక్రమాల్లో ఆశీనులు

- అక్రమంగా ఆశీలు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లు
- నగరంలో మూడు మార్కెట్లకు మాత్రమే టెండర్లు
- పాట నిర్వహించని ప్రాంతాల్లోనూ దిలక్కొట్టుడు
- ప్రతి రోజూ రూ.లక్షల్లో అక్రమాదాయం
- లబోదిబోమంటున్న చిరు వ్యాపారులు

సాక్షి, రాజమహేంద్రవరం: 'ఆశీ'లు పేరుతో కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో చిరు వ్యాపారాలు చేసుకునేవారికి కార్పొరేషన్ నిర్ధారించిన రుసుము వసూలు చేసి రోజువారి వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానిస్తుంది. పాట దక్కించుకున్న కాంట్రాక్టర్లు వీటి పరిధిలో వ్యాపారుల నుంచి నిర్ణీత రుసుము వసూలు చేసుకోవచ్చు.

నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు

8 ప్రధాన మార్కెట్లు ఉండగా.. అందులో సెంట్రల్ విజిటబుల్ మార్కెట్, ఆల్కట్ గార్డెన్స్, నాగులచెరువు మార్కెట్లుకు మూడు నెలల క్రితం వేలంపాట నిర్వహించారు. మిగిలిన ఐదు మార్కెట్లకు వేలం నిర్వహించాల్సి ఉంది. నిబంధనల మేరకు పాట నిర్వహించిన ప్రాంతాల్లోనే ఆశీలు వసూలు చేయాల్సి ఉంది. కానీ టెండర్లు ఖరారు కాని ప్రాంతాల్లో కూడా ఆశీలు వసూళ్లకు పాల్పడుతున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాట దక్కించుకున్న మూడు మార్కెట్ల కాంట్రాక్టర్ల కనుసన్నల్లోనే ఈ వసూళ్ల వ్యవహారం నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

వసూళ్లలో నయా ట్రెండ్

సెంట్రల్ జైల్ రోడ్డులో ఓ వ్యక్తి వసూళ్లకు కొత్త ట్రెండ్ అమలు చేస్తున్నారు. రసీదు ఇవ్వకుండా ప్రతి తోపుడు బండి వద్ద రూ.40 తీసుకుంటున్నాడు. రసీదు ఇవ్వాలని ఒత్తిడి చేసిన వ్యాపారుల వద్ద రూ.35 రసీదు ఇచ్చి అంతే మొత్తం తీసుకుంటున్నాడు. ఈ తంతు మూడు నెలలుగా సాగుతోంది. రసీదు ఎందుకు ఇవ్వడం లేని వ్యాపారులు ప్రశ్నిస్తే ప్రింటింగ్ వేయించాలన్న సమాధానం చెబుతున్నాడు. ఈ ప్రాంతంలో ఆశీలు వసూలు చేసేందుకు ఎలాంటి అధికారం లేకపోయినా.. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

రోజూ వసూలు చేసే నిర్ణీత రుసుము ఇలా..

వస్తువు	వసూలు (రూ.లలో)
సీతాఫలం, నేరేడు బండ్లు	43
కూరగాయలు, పుచ్చకాయల తదితర లారీకి	213
ఎడ్ల బండికి	53
ఉల్లి, బంగాళాదుంప, మిర్చికి	80
ఉల్లి మినీలారీకి	133
మోటారు సైకిల్‌కు	53

నెలకు రూ.45 లక్షల స్వాహా

నగరంలో 5 ప్రధాన మార్కెట్ల పరిధిలో రోడ్డు పక్కన వందల సంఖ్యలో తోపుడు బండ్లు, సొకిళ్ల, బుట్టలు తదితర ప్రత్యామ్నాయాలతో చిరు వ్యాపారం చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ప్రాధాన్యతను బట్టి రోజుకు రూ.30 వేలకు తక్కువ లేకుండా ఆశీలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. రోజుకు రూ.1.50 లక్షలు చొప్పున నెలకు రూ.45 లక్షలు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్ అధికారులకు తెలిసినా మిన్నకుంటున్నారని విమర్శలొస్తున్నాయి.. ఏ మార్కెట్‌కు పాట నిర్వహించారో, వేటికి లేదో అన్న విషయంలో స్పష్టత లేకపోవడంతో రసీదు తీసుకొచ్చిన వారికి డబ్బులు ఇచ్చేస్తున్నారు.



తనకు సంబంధం లేని సెంట్రల్ జైల్ ప్రాంతంలో ఆశీలు వసూలు చేసి ఇచ్చిన రసీదు

విచారించి చర్యలు తీసుకుంటా

నగరంలో పాట నిర్వహించని మార్కెట్లలో ఆశీలు వసూలు చేస్తున్న విషయమై విచారణ నిర్వహిస్తాం. నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం. 3 మార్కెట్లకు మాత్రమే పాట నిర్వహించాం. మిగిలిన వాటిలో ఎవరైనా వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఎవరికీ మినహాయింపు లేదు.

–కె.దినేష్‌కుమార్,
మున్సిపల్ కమిషనర్

నేడు వైఎస్సార్ పంటల బీమా విడుదల

- 15,087 మంది రైతులకు రూ.11.17 కోట్ల లబ్ధి
- ఐ.పంగిడిలో జిల్లాస్థాయి కార్యక్రమం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శనివారం 2022 ఖరీఫ్‌కు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ మాధవీలత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకు నోటిఫై చేసిన వరి దిగుబడి ఆధారంగా, వాతావరణ ఆధారిత నమోదు కోసం రైతుల తరపున ప్రీమియం వాటాను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిడదవోలు, గోపాలపురంలో అగ్రిల్యాబ్స్; రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోపాలపురంలో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలను సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారన్నారు. ఖరీఫ్ 2022కు సంబంధించి 15,087 మంది రైతుల బ్యాంకుఖాతాలకు రూ.11.17 కోట్లు జమచేస్తారన్నారు. ఈ మేరకు కొవ్వూరు మండలం ఐ.పంగిడిలోని జెడ్పీ హైస్కూల్లో జరిగే జిల్లాస్థాయి కార్యక్రమంలో హోం మంత్రి తానేటి వనిత, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ఏయూలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం



కొత్తపేట శిల్పశాలలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంతో శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) ప్రాంగణంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని నెలకొల్పనున్నారు. ఈ విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన ప్రముఖ జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ రూపొందించారు. వైఎస్ జయంతి సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరిస్తారని రాజ్‌కుమార్ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఏయూ తరఫున విగ్రహావిష్కరణ కమిటీ సభ్యుడు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి ఇచ్చిన ఆర్డర్ మేరకు వైఎస్ విగ్రహాన్ని తయారు చేశానని చెప్పారు. ఈ విగ్రహాన్ని ఏడున్నర అడుగుల ఎత్తున ఎంతో ప్రతిష్టాత్మకంగా తయారు చేశానని వుడయార్ తెలిపారు.

ఇన్‌స్పైర్ చేసేద్దామా!

- సృజనాత్మక ఆవిష్కరణలకు ఆహ్వానం
- ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్టుల రూపకల్పనకు సమయం ఆసన్నం
- నమోదుకు ఆగస్టు 31 తుది గడువు

రాయవరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ వేడుక వేదికగా నిలుస్తోంది. మూస విధానాలు, ఒకరిని చూసి మరొకరు ప్రయోగాలు అనుకరించకుండా ఉండేలా నూతన ఆవిష్కరణలకు ఈ కార్యక్రమం దోహదపడుతోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు, వారి ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు.

2023–24 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. ప్రతి తరగతి నుంచి ఒకరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే అవకాశముంది. 2008–09 నుంచి ఏటా ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు నిర్వహిస్తున్నారు.

ప్రాజెక్టులను పంపండిలా..

విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను www.inspireawards&dst.gov.in <http://www.inspireawards&dst.gov.in> వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా ఆగస్టు 30వ తేదీ లోపు నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తన ప్రాజెక్టును ప్రదర్శించేందుకు రూ.10 వేల పారితోషికం చెల్లిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి, జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలు తమ ప్రాజెక్టును మెరుగు పరచుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ రూ.25 వేల వరకూ అదనపు నిధులు కేటాయిస్తుంది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంటుంది.

దరఖాస్తు చేయాలిలా..

- **తొలుత పాఠశాల** స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను తీర్చేదిగా ఆ ఆలోచన ఉండాలి.
- **తరగతి వారీ**గా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, అందుకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి.
- **విద్యార్థి పేరు**, తండ్రి పేరు, తరగతి, విద్యార్థి బ్యాంకుఖాతా, ఆధార్‌నంబరు ఎంటర్ చేయాలి.
- ప్రాజెక్టు వివరాలను రాతపూర్వకంగా సంక్షిప్తంగా పొందుపరచి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.
- ప్రాజెక్టు పేరు, శాస్త్ర, సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రాజెక్టు ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు.
- ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు.

గత విద్యా సంవత్సరంలో..

ఉమ్మడి జిల్లాకు సంబంధించి గత విద్యా సంవత్సరంలో 5,400 ప్రాజెక్టులు రూపొందించగా 278 ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికై, రూ.10 వేల నగదుకు అర్హత సాధించాయి. వీటిలో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి 28 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. అయితే, వీటిలో జాతీయ స్థాయికి ఒక్క ప్రాజెక్టు కూడా ఎంపిక కాలేదు. ఈ ఏడాది ప్రతి జిల్లా నుంచీ అధిక సంఖ్యలో ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆయా జిల్లాల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులకు వెబెక్స్ నిర్వహించడంతో పాటు, సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతి నిర్వహించేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి కనీసం మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు చొప్పున ప్రాజెక్టులు రూపొందించాలి.

ఆలోచనలకు పదును పెట్టాలి



విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుని బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చక్కటి అవకాశం. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలకు పదును పెడితే, ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతమవుతాయి. ప్రాజెక్టుల రూపకల్పనపై త్వరలోనే సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

చొరవ చూపాలి



ఇన్నోవేషన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపేందుకు ఇది మంచి అవకాశం. ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలి. జిల్లా నుంచి అత్యధికంగా నామినేషన్లు నమోదయ్యేలా చూడాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో గొప్పగొప్ప శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశం లభిస్తుంది.

ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ

శాస్త్రీయ ఆలోచనలకు రూపమివ్వాలి



విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించి, వారి శాస్త్రీయ ఆలోచనలకు సైన్స్ ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలి. అప్పుడే మంచి ప్రాజెక్టులు ఆవిష్కృతమవుతాయి. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత సైన్స్ ఉపాధ్యాయులపై ఉంది.

– జీవీఎస్ శ్రీనివాస నెహ్రూ, జిల్లా సైన్స్ అధికారి, తూర్పు గోదావరి



సీఎం జగన్ చిత్రపటానికి మాదిగల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం క్షీరాభిషేకం చేశారు. మాదిగలు 2017లో గుంటూరులో కురుక్షేత్ర మహాసభ నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న సమయంలో నాటి సీఎం చంద్రబాబు ఆదేశాలతో టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లపాలు చేసిందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ గుర్తు చేశారు. నాటి తప్పుడు కేసులు ఎత్తివేయాల్సిందిగా బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు కోరగా, ముఖ్యమంత్రి జగన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆ కేసుల ఎత్తివేతకు హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ నేతలు చేట్ల రామారావు, ఆకుమర్తి సత్యనారాయణ, ముమ్మిడివరపు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునే పెద్ద మనసు జగన్‌ది

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఎస్.అన్నవరం–3లో జగనన్న సురక్ష



జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: పేదలను ఆదుకునే పెద్ద మనసు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని.. దీనికి భిన్నంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజల నుంచి విరాళాల సేకరణకు జోలి పట్టే గుణం టీడీపీ నేత చంద్రబాబుదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం–3 (కొత్త సూరవరం) సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ, 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు 600 హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టాక వాటిని నెరవేర్చడానికి డబ్బు లేదని, ఆర్థిక వ్యవస్థ బాగోలేదంటూ పంచాయతీల్లో హుండీలు, అమరావతిలో చందాలు వసూలు చేసిన చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి ప్రజల మనసులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం పొందారని అన్నారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. నాయకులు, అధికారుల వద్ద డబ్బుంటే బీరువాల్లో చేరుతుందని.. అదే పేదల వద్ద ఉంటే ఖర్చు చేయడం ద్వారా వ్యాపారాలు, పరిశ్రమల్లో డబ్బు చలామణి అయి ప్రభుత్వాలకు పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుందని విశ్లేషించారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి అవుతుందని మంత్రి రాజా చెప్పారు. 2016లో రైలును దగ్ధం చేసిన ఘటనలో వందలాది మందిపై తప్పుడు కేసులు బనాయించిన టీడీపీ.. 1988లో వంగవీటి మోహనరంగాను టీడీపీ నాయకులు హత్య చేయించి కేసులు పెట్టారని గుర్తు చేశారు. తునిలో 1989లో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని టీడీపీ నాయకులు తొలగించేస్తే.. దానిని సూరవరంలో ప్రతిష్ఠించారని చెప్పారు. అటువంటి టీడీపీ నాయకులు సిగ్గులేకుండా రంగా విగ్రహానికి పూలమాలలు వేశారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుళ్లు, కుతంత్రాలతో శకుని లా రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గ ప్రజలకు దూరంగా హైదరాబాద్‌లో ఉంటూ, తన కుమార్తెను గెలిపించాలంటూ ఆయన తిరుగుతున్నారని విమర్శించారు. యనమల కుమార్తె గెలిస్తే భర్త దగ్గర బెంగళూరులో ఉంటారని చెప్పారు. టీడీపీ నాయకుల మొసలి కన్నీరుకు మోసపోవద్దని మంత్రి రాజా విజ్ఞప్తి చేశారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన




జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చలమలశెట్టి సునీల్ చారిట్రబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయంలో రెండు రోజుల జాబ్‌మేళాను ఆయన శుక్రవారం ప్రారంభించారు. దీనికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ, 70 కంపెనీలకు సంబంధించి 3 వేలకు పైగా ఉద్యోగాల కల్పనకు ఈ మేళా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తొలి రోజు 4,300 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా 3 వేల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. మిగిలిన వారితో పాటు శనివారం కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కూడా ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారికి ఆయా సంస్థలు ఉద్యోగాలు కల్పిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, టీపీఓ ఎ.కరుణ, శ్యామ్‌కుమార్, ట్రస్ట్ చైర్మన్ రెడ్డం దుర్గాప్రసాద్, డీఎపీ మురళీకృష్ణ, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ వి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ఓరియెంటేషన్‌తో డిగ్రీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డిగ్రీలో సివిల్స్ ఓరియెంటేషన్ ప్రారంభించనున్నట్లు శ్రీ షిర్డీ సాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, తమ డాఫ్నీ సివిల్స్ అకాడమీ ద్వారా సివిల్స్ శిక్షణ ఇవ్వనున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. 21 సంవత్సరాలకే ఐఏఎస్ లేదా ఐపీఎస్ సాధించడం, సివిల్స్ ఓరియెంటేషన్‌తో ఇతర ప్రయోజనాలు, డిగ్రీలో ఏ గ్రూపు చదివితే సివిల్స్ సాధించగలం వంటి అనేక సందేహాలను ఈ సదస్సులో నివృత్తి చేయనున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సదస్సుకు హాజరు కావచ్చని, వివరాలకు 95812 71119 నంబరులో సంప్రదించాలని శ్రీవిద్య కోరారు.

'నన్నయ'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు 360 మంది హాజరు



ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరైన అభ్యర్థులకు సూచనలిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కెమిస్ట్రీ, ఫార్మసీ విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు గోదావరి జిల్లాల నుంచి 360 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కంట్రోల్, క్వాలిటీ ఎసెస్మెంట్, ప్రొడక్షన్ విభాగాల్లో ఉద్యోగాలకు హైదరాబాద్ పెట్రో గ్రూప్స్ సంస్థ వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించిందని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరించారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు రాత పరీక్ష నిర్వహించారు. దీనిలో అర్హత సాధించిన వారి జాబితా ఆన్‌లైన్‌లో తెలియజేస్తామని, అనంతరం తుది ఇంటర్వ్యూలు చేసి, ఎంపికలు చేపడతామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.92 లక్షల నుంచి రూ.3.06 లక్షల ప్యాకేజీతో వేతనం ఉంటుందన్నారు. ఆర్‌అండ్‌డీ సెల్ డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, అవంతి ఫుడ్స్ హెచ్‌ఆర్ ఎస్.శశి భూషణ్, హెటిరో హెచ్‌ఆర్ అబ్బాస్, శశి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు ప్రారంభం

- 9 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారుల రాక
- మూడు రోజుల పాటు 12 విభాగాల్లో పోటీలు



టీటీ పోటీలను ప్రారంభిస్తున్న భాస్కర్‌రామ్ తదితరులు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) పోటీలు గోదావరి గట్టున ఉన్న శ్రీ త్యాగరాజ సేవా సమితి ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.భాస్కర్‌రామ్, చిట్టూరి విజయప్రకాశ్, కార్యదర్శి పి.విశ్వనాథ్ ఈ పోటీలను ప్రారంభించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్–11, 13, 15, 17, 19 బాల బాలికలు, పురుషులు, స్త్రీలు కలిపి మొత్తం 12 విభాగాల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం 10 టేబుళ్లపై జరిగే ఈ పోటీల్లో తూర్పు గోదావరితో పాటు గుంటూరు, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హోరాహోరీ తలపడనున్నారు. ఒక చీఫ్ రిఫరీ, ఇద్దరు అసిస్టెంట్ రిఫరీలు, 20 మంది అంపైర్లతో ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజైన ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు, మెడల్స్ అందించనున్నారు. పాయింట్ల ఆధారంగా విజేతలు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పలు పోటీలు నిర్వహించి టేబుల్ టెన్నిస్‌లో రాజమహేంద్రవరానికి ఒక మంచి గుర్తింపు తీసుకువచ్చామని ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.భాస్కర్ రామ్ చెప్పారు. ఈ ఆటతో చదువుపై ఏకాగ్రత పెరిగి, మంచి తెలివితేటలతో జీవితంలో ముందుకు వెళ్లే అవకాశం క్రీడాకారులకు లభిస్తుందని అన్నారు.

వెయ్యి రోజుల్లో 10 లక్షల మందికి అన్నదానం

- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు అభినందనలు



రాంబాబుకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందజేస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కరోనా సమయం నుంచి నేటి వరకూ నిరంతరాయంగా వెయ్యి రోజులుగా పేదల ఆకలి తీరుస్తున్న స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రశంసించారు. నగరంలోని పుష్కర ఘాట్‌లో స్వర్ణాంధ్ర సేవా సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శుక్రవారంతో వెయ్యి రోజులు పూర్తయ్యింది. ఈ సందర్భంగా రాంబాబును ఘనంగా సత్కరించి, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పత్రం అందజేశారు. వెయ్యి రోజుల పాటు నిరాటంకంగా 10 లక్షల మందికి అన్నదానం నిర్వహించడం గొప్ప విషయని ఎస్పీ అన్నారు. రాంబాబు మాట్లాడుతూ, నగర ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతల సహకారంతో 25 ఏళ్లుగా స్వర్ణాంధ్ర సేవాసంస్థను నిర్వహిస్తున్నామన్నారు. పేదలు ఆకలితో అలమటించకూడదనే సదుద్దేశంతో నిరాశ్రయుల వద్దకే వెళ్లి అన్నదానం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ వస్త్ర వ్యాపారులు తుమ్మిడి అరుణ్ కుమార్, మూల్ నివాసి జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

గో డిజిటల్ ఇన్సూరెన్స్‌కు భారీ వడ్డన

కాకినాడ లీగల్: సమయానికి రిజిస్ట్రేషన్ చేయని కారణంగా కారుకు ఇన్సూరెన్స్ ఇవ్వడానికి నిరాకరించిన బీమా సంస్థకు వినియోగదారుల కమిషన్ భారీగా వడ్డించింది. వివరాలివీ.. తాళ్లరేవు మండలం సుంకరపాలేనికి చెందిన పెద్దిరెడ్డి లోవరాజు రాజమహేంద్రవరం కంటిపూడి మోటార్స్‌లో 2019 నవంబర్ 13న కియా కారు కొనుగోలు చేశారు. దీనికి టెంపరరీ రిజిస్ట్రేషన్‌తో పాటు గో డిజిటల్ సంస్థ ద్వారా ఏడాది కాలానికి ఇన్సూరెన్స్ తీసుకున్నారు. టెంపరరీ రిజిస్ట్రేషన్ గడువు 30 రోజులు కాగా, ఆ కారుకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం 2020 ఫిబ్రవరి 12న లోవరాజు దరఖాస్తు చేశారు. అనంతరం 2020 ఏప్రిల్ 9న కారుకు ప్రమాదం జరిగింది. దీంతో ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయగా.. కారుకు సమయానికి రిజిస్ట్రేషన్ చేయలేదనే కారణంతో బీమా చెల్లించడానికి గో డిజిటల్ సంస్థ నిరాకరించింది. దీనిపై లోవరాజు 2021 జూన్ 28న కాకినాడ వినియోగదారుల కమిషన్‌ను న్యాయవాది ద్వారా ఆశ్రయించారు. కారు మరమ్మతులకు రూ.10,83,322, షోరూములో కారు ఉంచడానికి అయిన అద్దె, డ్యామేజీల నిమిత్తం రూ.5 లక్షలు, కోర్టు ఖర్చులు కలిపి 9 శాతం వడ్డీతో ఇప్పించాలని కోరారు. విచారణ అనంతరం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాధితుడు లోవరాజు కోరిన దానికి మించి రూ.14,43,098 బీమాతో పాటు.. 2020 మార్చి 20 నుంచి చెల్లింపు తేదీ వరకూ 9 శాతం వడ్డీ చెల్లించాల్సిందిగా గో డిజిటల్ ఇన్సూరెన్స్ కంపెనీని వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షుడు చెరుకూరి రఘుపతి వసంత్ కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు.

నగల దుకాణంలో అగ్ని ప్రమాదం

పెద్దాపురం: స్థానిక మెయిన్ రోడ్డులోని జల్లూరి వీర్రాజు జ్యూయలర్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. పెద్దాపురం అగ్నిమాపకాధికారి శ్రీహరి జగన్నాథ్ కథనం ప్రకారం.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భవనం పై అంతస్తు నుంచి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

కాలువలో మునిగి బాలుడి మృతి



ఫణీశ్వర్ (పాత చిత్రం)

కొవ్వూరు: ఓ బాలుడు కాలువలో మునిగి మృతి చెందిన ఘటన పశివేదల గ్రామంలో విషాదాన్ని నింపింది. రూరల్ ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చందక ఫణీశ్వర్ (9) గురువారం సాయంత్రం ఇంటి నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికారు. అతడి దుస్తులు గ్రామ సమీపాన ఉన్న పేముల కాలువ ఒడ్డున శుక్రవారం ఉదయం కనిపించడంతో కాలువలో వెతికినట్టు బాలుడి మేనమామ మీసాల శ్రీను తెలిపారు. ఆడుకుంటున్న క్రమంలో ఆ కాలువలోకి దిగి, నీట మునిగి ఫణీశ్వర్ మృతి చెందినట్టు నిర్ధారించుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. తల్లిదండ్రులకు ఇద్దరు కొడుకులు కాగా, ఫణీశ్వర్ మొదటి సంతానం. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.